క్లుప్తంగా

6 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కూడలిలో సెప్టెంబర్ 6 నుంచి 16 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞానవేదిక ప్రతినిధులు తెలిపారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో 11 రోజులపాటు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు, భగవద్గీత శ్లోకాల పఠనం, కృష్ణ భగవానునికి పూజలు జరపనున్నారు. చివరి రోజైన 16న మధ్యాహ్నం 3 గంటల నుంచి తాటితూరు కూడలి ద్వారా భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్టు సమితి ప్రతినిధి రావణ్ అక్షయ్ తెలిపారు. వివరాలకు 97045 29963, 77805 32975లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా హయగ్రీవ జయంతి


శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారిజా ఆశ్రమంలో శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో బుధవారం శ్రావణ పూర్ణిమ, శ్రీ లక్ష్మీ హయగ్రీవ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం ఉదయం 7.30 నుంచి తిరుమంజనం (అభిషేకం), హోమం, కవచ అలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు ఫ్యాన్ల వితరణ


ఫ్యాన్లతో విద్యార్థులు, అధ్యాపకులు

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తగరపువలసకు చెందిన మణికంఠ సీట్స్, బేకరీ సీలింగ్ ఫ్యాన్లు అందించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల కోసం వీటిని అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందన

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన నౌకానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.ఉమాగాంధీని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన అవార్డుకు ఎంపికైన ఉమాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్వల లక్ష్మి, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, ముర్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల మనసులను ఆకట్టుకునే విధంగా బోధన పటిమతో జాతీయ స్థాయిలో అవార్డును సాధించడం గర్వకారణమన్నారు. ఇటువంటి అవార్డులు మరింత స్ఫూర్తిని ఇస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

మెరుగైన ఆరోగ్యంపై సదస్సు

కొమ్మాది: ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధికి తోడ్పడే మెరుగైన ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) నిర్వాహక కార్యదర్శి డాక్టర్ నాగమణి తెలిపారు. ఆసుపత్రి సామాజిక వైద్య విభాగంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఈ ప్రత్యేక సదస్సు జరుగుతుందన్నారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ సంయుక్తంగా గీతం వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతుబజారుకు మార్గం సుగమం

- తీరనున్న ఆనందపురం వాసుల కల
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రతిపాదనకు మార్కెటింగ్ శాఖ ఆమోదం
- రూ.47.50 లక్షలతో సౌకర్యాల కల్పన
- మార్కెట్ యార్డులో నిర్వహించేందుకు ఏర్పాట్లు
- మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎలమంచిలి వెల్లడి


ఆనందపురం జంక్షన్‌లోని మార్కెట్ యార్డు


కొత్తగా షెడ్లు నిర్మించనున్న ప్రదేశం

ఆనందపురం : ఆనందపురంలో రైతు బజారు ఏర్పాటు కానుంది. ఎప్పటి నుంచో ప్రతిపాదనల స్థాయిలోనే ఉన్న రైతు బజారు ఏర్పాటుకు మార్గం సుగమం కానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రతిపాదనలకు మార్కెటింగ్ శాఖ ఆమోదం తెలిపిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ వెల్లడించారు. ఈ బజారు ఏర్పాటైతే అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు చేకూరనుంది.
మండలంలోని వేములవలస (ఆనందపురం జంక్షన్)లో ప్రతీరోజు జరిగే మార్కెట్‌లో కూరగాయలు, ఆకుకూరలు, ఇతర నిత్యావసర సరకులకు సంబంధించి లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. కాగా, ఆనందపురం మండలంలోని వివిధ గ్రామాల్లో నివసించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక్కడ రోజువారీ మార్కెట్‌కు నిత్యం వందలాది మంది కొనుగోలుదారులు వస్తుంటారు. రోజు తెల్లవారుజాము నుంచి రాత్రి 9 గంటల వరకు మార్కెట్ జరుగుతుంటుంది. కాగా, ఇక్కడ మార్కెట్‌లో ధరల నియంత్రణ లేకపోవడంతో వినియోగదారులు అదనపు ధరలు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా పర్వదినాల్లో ఇక్కడ ధరలు ఆకాశాన్నంటి వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేస్తే మార్కెట్ కమిటీకి ఆదాయం రావడంతో పాటు వినియోగదారులకు నిర్దేశించిన ధరలకే వస్తువులు లభ్యమవుతాయని మార్కెట్ కమిటీ భావించింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కృషి మేరకు రైతు బజారు ఏర్పాటుకు అనుమతి లభించింది.

కొత్తగా 50 షెడ్లు నిర్మాణం

రైతు బజారుకు వచ్చే రైతులు తమ సరకులను విక్రయించుకోవడానికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. మార్కెట్ యార్డులో ఓ పెద్ద భవనంతో పాటు 25 రేకులు షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. చుట్టూ ప్రహరీ ఉండడంతో బజారు నియంత్రణకు ఇబ్బందులు కూడా ఉండవు. వాటిని వినియోగంలోకి తేవడంతో పాటు మరో 50 షెడ్లు నిర్మించనున్నారు. మరుగుదొడ్లను నిర్మించి, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇక్కడ అద్దెలు, ఇతరత్రా వ్యయాలను నిర్ణయిస్తారు.


మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ఉన్న షెడ్లు

తొందరలో పనులు ప్రారంభిస్తాం

ఆనందపురంలో రైతు బజారు ఏర్పాటు చేయడానికి మార్కెటింగ్ శాఖ నుంచి పరిపాలనాపరమైన అనుమతి లభించింది. ఈ మేరకు రూ.47.50 లక్షలతో పనులు చేపట్టడానికి త్వరలో టెండర్లు పిలవనున్నాం. ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మండలంలోని 26 పంచాయతీల రైతులకు అవకాశం కల్పిస్తాం.
– ఎలమంచిలి సూర్యనారాయణ, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ


విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : ప్రభుత్వ పాఠశాలలను దాతలు ప్రోత్సహించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 240 మంది విద్యార్థులు, 16 మంది ఉపాధ్యాయులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్‌బాబు సమకూర్చిన గుర్తింపు కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు జగదీష్‌బాబు గుర్తింపు కార్డులు సరఫరా చేయడం అభినందనీయమన్నారు. దాతలు చేస్తున్న సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలన్నారు. ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న అయ్యప్పస్వామి భక్తుల సమావేశం

తగరపువలస : స్థానిక అంబేడ్కర్ కూడలిలోని ఎంఎఫ్‌సీ ఎదురుగా గల యోగా కేంద్రంలో సెప్టెంబరు 3వ తేదీ ఉదయం 10 గంటలకు అయ్యప్పస్వామి భక్తుల సమావేశం జరగనుంది. నవంబర్ 24,25,26 తేదీల్లో విశాఖ రైల్వే గ్రౌండ్‌లో జరిగే అయ్యప్ప మహా సంగమ పూజా కార్యక్రమానికి సంబంధించి ఉత్తరాంధ్ర భక్తుల సూచనలు, సలహాల స్వీకరణలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. నగరానికి చెందిన గురుస్వామి పైల ఆదిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి అయ్యప్పస్వామి భక్తులు, గురుస్వాములు హాజరు కావాలని కోరారు. వివరాలకు 98495 41828, 78422 23999 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఎస్‌వోఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్


విశాఖ ఆర్డీవోకు రాఖీ కడుతున్న ఎస్‌వోఎస్ బాలిక

భీమునిపట్నం: రక్షాబంధన్ సందర్భంగా స్థానిక ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌కు చెందిన బాలికలు విశాఖ జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను సొంతపిల్లల్లా పెంచి, చదివిస్తూ వారికి మంచి భవిష్యత్తును అందిస్తున్న ఎస్‌వోఎస్ సేవలు ఎనలేనివన్నారు. ఇందులోని ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి వివాహాలు కూడా జరిపించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమ ప్రోగ్రామ్ మేనేజర్ కె.దుర్గరాజు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వి.సత్యనారాయణ, యానిమేటర్లు సరళ, అప్పలకొండ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సుత్తమ్మతల్లి


గజమాలతో అలంకరించిన సుత్తమ్మతల్లి విగ్రహం

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లి విగ్రహాన్ని బుధవారం ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనాలు కల్పించారు. ప్రతి వారం ప్రత్యేక అలంకరణలో భాగంగా ఈ వారం గజమాలలు, తులసిమాలలు, నిమ్మకాయల దండలు వినియోగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పారదర్శకంగా తనిఖీలు


మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను డీఆర్‌పీలు పారదర్శకంగా తనిఖీ చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులను వచ్చే నెల 15 వరకు డీఆర్‌పీలు తనిఖీలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ పి.రాధ, ఉపాధి హామీ పథకం ఏపీవో వరలక్ష్మి, ఎస్ఆర్‌పీ మన్మథరావు పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు తప్పనిసరి


స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజబాబు

మధురవాడ : విద్యార్థులకు మరింత సులువుగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించడంలో మెలకువలు అలవరచుకోవాలని చంద్రంపాలెం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజబాబు చెప్పారు. బుధవారం ఇక్కడ ఎలిమెంటరీ పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ జరిగింది. ఇందులో బోధన, ఎండీఎం, ఐఎఫ్‌పీ బోర్డుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం


బహుమతులు అందుకుంటున్న వాకర్లు

భీమునిపట్నం: భీమిలిలోని సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షుడు ఎస్.పి.రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాకింగ్ వల్ల వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. ఇక్కడి సభ్యులకు ఇంటర్నేషనల్ వాకర్స్ వారు గుర్తింపు కార్డులు ఇచ్చారు, వీటివల్ల ఆస్పత్రులు, డిపార్ట్‌మెంట్ స్టోర్లు, హోటళ్లల్లో రాయితీలు ఉంటాయని తెలిపారు. పది మంది నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్‌కు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

వివాహిత అదృశ్యం

తగరపువలస: వివాహిత అదృశ్యమైన ఘటనపై భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ప్రకాశం జిల్లా వెలిగండ్లకు చెందిన రాజశేఖరరెడ్డికి నాలుగు నెలల క్రితం మోనిక (24)తో వివాహం అయింది. ఆయన బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా మోనిక విశాఖలో ఎంబీఏ చదువుతోంది. ఈమెను పరీక్షల నిమిత్తం తగరపువలస వద్ద ఆదర్శనగర్‌లో రాజశేఖరరెడ్డి సోదరి ఇంటి వద్ద ఉంచారు. మంగళవారం ఉదయం క్యాంపస్ సెలక్షన్లు ఉన్నాయని ఇంటి నుంచి వెళ్లిన మోనిక తిరిగి రాలేదు. అదేరోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భర్తకు ఫోన్ చేసిన మోనిక తాను సొంతంగా ఉద్యోగం చేసుకుని బతుకుతానని, తన గురించి వెదకొద్దని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. తరువాత ఎంతకీ ఫోన్ ఆన్ చేయకపోవడంతో ఆమె భర్త ఎం.రాజశేఖరరెడ్డి ఫిర్యాదు చేశారు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖర్లు

ఆనందపురం : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రేషన్ల విషయంలో కొత్త నిబంధనలు ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ స్థానిక దస్తావేజు లేఖర్లు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు లేఖర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న కార్డు ప్రైమ్ 2.0 విధానం వలన దస్తావేజు లేఖర్లకు ఉపాధి పోవడంతో పాటు కక్షిదారులకు సక్రమమైన దస్తావేజులు అందే పరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. సమ్మె గురువారం కూడా కొనసాగుతుందని తెలియజేశారు.
భీమునిపట్నం: స్థానిక దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెన్‌డౌన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ఇప్పటివరకు కచ్చితంగా ఒరిజినల్ దస్తావేజులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, కొత్త విధానం వల్ల ఒరిజినల్‌తో సంబంధం లేకుండా డిజిటల్ దస్తావేజుల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని అమలు చేయనున్నారని తెలిపారు. దీనివల్ల చాలా సమస్యలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో గిడుగు కామేశ్వరరావు, బెత లక్ష్మి, భానుప్రకాశ్, అడిదం వెంకట శేషగిరావు, వి.వి.సుబ్రహ్మణ్యం, సాయి పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న సన్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

భీమునిపట్నం : కీతిన్ పేటవద్ద ఉన్న సన్‌స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీ, ప్రశంసా పత్రాలు పొందారు. వారిని బుధవారం స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా కృషి చేసి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

మధురవాడ : విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. బుధవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎదురవుతున్న వేధింపులు, ఇతర సమస్యలు స్వేచ్ఛగా పోలీసులకు తెలపడానికి కంప్లెయింట్ బాక్స్ ఏర్పాటు చేయాలని, వాటిని పోలీసుల సమక్షంలోనే తెరచి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. అలాగే బ్యాడ్ టచ్, గుడ్ టచ్ మధ్య తేడాలు, పోక్సో చట్టం, దిశ చట్టం, బాలల హక్కులు తదితర అంశాలపై విపులంగా వివరించారు. డ్రగ్స్ వంటి వాటికి దూరంగా, క్రమ శిక్షణతో బాగా చదవాలని చెప్పారు. జీవితంలో విద్యార్థి దశ ముఖ్యమైనదని, బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, పీఎం పాలెం సీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్-13 ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లాకు తృతీయస్థానం


అండర్-13 ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

తగరపువలస : ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని లయోలా కళాశాలలో ఈ నెల 29,30 తేదీల్లో జరిగిన అండర్-13 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విశాఖ జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా అండర్-13 జట్టు చిన్నారులను రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, కార్యదర్శి అక్కరమాని చినబాబు, కోచ్ కృష్ణ, వెటరన్ క్రీడాకారులు పందిరి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు. త్వరలో అనంతపురంలో జరగనున్న జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు పాల్గొంటుందని శ్రీధర్ తెలిపారన్నారు.

గ్రామస్తులకు శ్మశానవాటిక అప్పగింత


పాత మూలకుద్దు గ్రామస్తులకు శ్మశానవాటిక అప్పగిస్తున్న దివీస్ యాజమాన్యం

తగరపువలస : భీమిలి మండలం పాత మూలకుద్దులో రూ.16 లక్షల సామాజిక సేవా నిధులతో వసతులు కల్పించిన శ్మశాన వాటికను బుధవారం దివీస్ యాజమాన్యం గ్రామస్తులకు అప్పగించింది. దీనిని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, కొల్లి కోటిరెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఇ.ఎస్.నాగరాజు, కె.నరసింహారావు, గ్రామ పెద్దలు ఆశి రమణ, కేటీ రామునాయుడు, కొల్లి రామకృష్ణ, కొయ్య రామకృష్ణ, రమేష్, జీరు మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం


మధురవాడ అప్ బ్రిడ్జి- మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

- బుధవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్
- అప్ బ్రిడ్జి, కొమ్మాది, కార్‌షెడ్, వుడా కాలనీ జంక్షన్ అన్ని చోట్లా ఇదే పరిస్థితి


పోలీస్‌స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్‌లో చిక్కుకున్న పోలీసు వాహనం

మధురవాడ : నగరంతో పాటు శివారు ప్రాంతాలు కూడా దినదినాభివృద్ధి చెందుతుండడంతో ట్రాఫిక్ కూడా విపరీతంగా పెరిగిపోతోంది. సాయంత్రం అయితే మధురవాడలో వాహనచోదకులు, స్థానికులకు ట్రాఫిక్ సమస్య చుక్కలు చూపిస్తోంది. బుధవారం సాయంత్రం అయితే మధురవాడ అప్ బ్రిడ్జి, నగరంపాలెం రోడ్డు, మార్కెట్, కొమ్మాది జంక్షన్, వుడా కాలనీ, కార్‌షెడ్ జంక్షన్‌లలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసు స్టేషన్ రోడ్డులో పోలీసు అధికారుల వాహనం కూడా చిక్కుకుపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నియంత్రణలో స్థానికులు పోలీసులకు బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అలివేలు మంగాదేవికి విశేషంగా అభిషేకం


కలశాలను తీసుకొస్తున్న భక్తులు

సింహాచలం: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని జీవీఎంసీ 97వ వార్డు సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో అమ్మవారికి బుధవారం విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. 108 కలశాలతో భక్తులు పవిత్రాలు తీసుకువచ్చి అభిషేకం చేశారు. నక్షత్ర హారతి అందజేశారు. లక్ష్మీసహస్రనామ పారాయణ, విష్ణు సహస్ర నామపారాయణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు